చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

సాంస్కృతిక యోధుడు మాష్టార్జీ

తెలుగు నేలలో ఆధునిక దళిత సాహితీ యుగానికి ప్రారంభ గీతం పాడింది మాష్టార్జీ. కారంచేడు ఉద్యమంలో ఆయన పాడిన 'అందుకో దండాలు బాబా అంబేద్కరా..' అన్న పాట అన్ని వేదికల మీద మార్మోగింది. 'ఎందరో పుట్టారు మహనీయులు' అని ఆయన ఆలపించిన పాటలో కరుణ, ఆర్ద్రత ఉన్నాయి.

మాష్టార్జీకి దళితుల వ్యక్తిత్వం గురించి ఒక లోతైన తపన ఉన్నది. దళితుల జీవితం, వ్యక్తిత్వంతో పాటు సాహిత్యం కూడా నిర్లక్ష్యానికి గురైందని, దాన్ని ప్రముఖ స్థానంలో నిలబెట్టాలనే పని మీద ఉంటారాయన. ఆ పనిని అర్థం చేసుకోవడం అందరికీ కష్టం. మాష్టార్జీది జానపద సంస్కృతి. ఆయన పాట, మాట జీవితాల నుంచి అందుకున్నవే. ఆయనకు జానపద సంస్కృతి అంటే దళిత సంస్కృతే.

దళిత సాహిత్యం ఆగిపోయిందని, వ్యక్తిగత ప్రతిష్ట కోసమే కొందరు రాస్తున్నారని పలువురు సంప్రదాయ సాహిత్య వాదులు ముద్ర వేయాలని చూస్తున్నారు. దళితులు నాలుగు పుస్తకాలు వేస్తే కెరీరిజం అవుతుంది. పెద్దపెద్ద వాదాలు చెప్పి తమ కులం పెద్దల ద్వారా అవార్డులు తెప్పించుకునేవారు, ప్రజాకవులని ప్రచారం పొందుతున్నారు. సంప్రదాయవాదులు తమ మాటల్లో పుట్టుకను దాటుతున్నారు గానీ, తమ చూపుల్లో, ఆలోచనల్లో తమ పుట్టుకను దాటలేకపోతున్నారు. శూద్ర సంప్రదాయ వాదులైతే.. కులం ముళ్ల కంచెలో ఇరుక్కొని మరీ మాట్లాడుతున్నారు. వారిది కుల సంప్రదాయ వాదం. దళిత సాహిత్యకారులను, కళాకారులను, కవులను, నాయకులను ప్రజాదరణ పొందకుండా చేయాలని వారు నిరంతరం అన్వేషిస్తుంటారు. కానీ, ఈ యుగం దళితయుగం. తత్వశాస్త్రం, కవిత్వం, కథ, నవల, పాట, విశ్లేషణ, విమర్శ, బోధ, సంభాషణ, సమన్వయం, సాధికారికత, సాదృశ్యత అన్నీ దళితవాద మూలాల నుంచే జరుగుతున్నాయి. చార్వాకులు ఇంకా ఎందరో తాత్వికులు దళితవాదానికి నేపథ్యంగా ఉన్నారు. అగ్రకులాలు ఏ వాదం సృష్టించుకున్నా వారి నేపథ్య పరిధి చిన్నది. మనం సంప్రదాయవాదాన్ని ఈ దిశ నుంచే ఎవరిలోనైనా గుర్తించాల్సి ఉంటుంది.

> మాష్టార్జీకి లోతైన అభివ్యక్తి ఉంది. స్త్రీతత్వ గీతాలు ఆయన రచనా క్రమానికి సజీవతను చేకూరుస్తున్నాయి. 'జీవులకు ఆదిగురువు అమ్మరా' అని ఆయన పాడిన తత్వగీతాలలో మాతృస్వామ్య సంస్కృతి పునాదులున్నాయి. ఆయన పాటలో తత్వగీతి లయ ఉన్నది. అమ్మ సమాజానికి మూలం. అమ్మ సంస్కృతికి మూలం. అమ్మ ఒక గణవ్యవస్థ అనే చారిత్రక అవగాహనతో మాష్టార్జీలో పోతులూరి వీరబ్రహ్మం గీతాల తత్వబాణి ధ్వనిస్తుంది. సమాజ పరిణామ క్రమంలో పూర్వకాలాంశాలను పునర్జీవనం చేసే చోదక శక్తులు ఉపయుక్తమవుతాయి. అటువంటివారే మాష్టార్జీ.

మాష్టార్జీ తన పాటలలో పితృస్వామ్య వ్యవస్థ మీద ఎలుగెత్తారు. రాత కంటే కూడా కూత పురాతనమైనదని, ప్రాచీనమైనదని, పరివ్యాప్తమైనదని ఆయన నినదించారు. సంప్రదాయ సాహిత్య భావజాలం మౌఖిక జాతులకు అనుకరణే అని ఆయన చాటిచెప్పారు. అందుకే ఆయన పాట ఒక బాధ అయింది. ఒక వేదనను, ఒక ఘర్షణను ఆయన తన పాత్రలతో చెప్పించారు. తాను పాడేటప్పుడు, ఆడేటప్పుడు మాష్టార్జీగా కాక పాత్ర నుంచి పాడగలగడమే ఆయనలోని మూలతత్వం. కళా మౌఖిక సాహితీ దృశ్యాన్ని వీరి కండ్ల నుంచి సాత్విక వాచిక, అభినయాల నుంచి చూపించే పద్ధతి దళిత సంస్కృతికి ప్రతీక. వీరి నొసలులోని ముడి ఆగ్రహానికి చిహ్నం. వీరి మునివేలు అంబేద్కర్‌లోని ప్రశ్నను తలపిస్తుంది. అందుకే మాష్టార్జీది అంబేద్కర్ వాద ముద్ర.

ఈ యుగ సాంస్కృతిక కళా ఉద్యమానికి గద్దర్, మాష్టార్జీ రెండు కండ్లలాంటివారు అంటారు పెక్కురు. నేను వారితో ఏకీభవిస్తాను. వారి సామాజిక పునాది వారికలా నిండుతనాన్ని కల్పించింది. సముద్రం ఘోషిస్తున్నట్టు, నది ప్రవహిస్తున్నట్టు వారిరువురు ఈ యుగాన్ని ముంచెత్తారు. సమకాలీనుల ఈర్ష్యకందనంత ఎత్తుకు ఎదగడం వారిలోని గొప్పతనం. స్నేహం వారి ఆయువు. దళిత వచన కవిత్వంలో కూడా ఎండ్లూరి, మద్దూరి, సతీష్ చందర్, శిఖామణి, పైడి తెరేష్‌బాబు వంటి వారి స్థాయిలో ఎందుకు ఇతర కవులు రాయలేకపోతున్నారు. వీరు జాలి దయల నుంచి గాక ఆత్మాభిమానాల నుంచి మాట్లాడుతున్నారు. వీరు వచనంలో రాయకముందే గద్దర్, మాష్టార్జీ పాటల్లోకి తెచ్చారు. తత్వశాస్త్ర భాగంలో బీఎస్ రాములు, కంచె ఐలయ్య, కేఎస్ చలం గొంతులు తాత్విక సృజనాత్మకతను ముందుకుతెచ్చాయి. వారి నిబద్ధత దీనికి మూలం. అందుకే వారు ప్రపంచవ్యాప్తం అవుతున్నారు. సంప్రదాయ రచయితలు ఎదగలేనంత ఎత్తుకు ఎదిగారు. నవల, కథా ప్రక్రియలో కాలువ మల్లయ్య, కళ్యాణ్‌రావు శక్తిమంతమైన అల్లిక రచయితలు. ఎందుకు ఇతరులు వీరిని అందుకోలేకపోతున్నారు. వారి వారి జీవితం నుంచి, అనుభవం నుంచి మాట్లాడటమే కారణం.

ఎవరో అన్నట్టు దళిత సాహిత్యయుగం ముగియలేదు. దానివెనుక దళిత ఉద్యమం ఉన్నది. అది శక్తిమంతమైనది. ఒకసారి అది ఉద్యమ రూపంలో ఉండవచ్చు లేక ప్రచార రూపంలో ఉండవచ్చు, మరోసారి నిర్మాణ రూపంలో ఉండవచ్చు. ఏ రూపంలో ఉన్నా ఆకలి, అవమానం ఉన్నంతకాలం దళిత ఉద్యమం సజీవంగానే ఉంటుంది. అగ్రకుల మేధావులకు కనిపించి దాని ఉనికి చాటుకోవాల్సిన అవసరం లేదు.

నిజానికి మాష్టార్జీ దళిత ఉద్యమానికి పతాక లాంటివారు. మాష్టార్జీ పాటలన్నీ కవిత్వాలే. ఆయన సావిత్రీబాయి పూలేపై రాసిన పాట స్త్రీల హృదయాలను కదిలించింది.

> సావిత్రి పూలే తల్లి నీకు దండాలే
> భారత బహుజన జాతుల బతుకున
> వెలుగును నిలిపావే విద్య వెలుగును నింపావే ॥సావిత్రి॥
>
> అణచివేతను ఆనందంగా అనుభవించేవారిని
> అజ్ఞానపుటడుగు నుంచి విద్య లేనివారిని
> ఉద్ధరించే ఉద్యమానికి పూనుకున్న జ్యోతిబాపూలేకు
> తోడు నీడగ సాకరించి కూడి పోరు నడిపినట్టి ॥సావిత్రి॥

మాష్టార్జీ మాతృ హృదయుడు. తల్లి మీద ఆయన రాసిన పాటలో ఆకాశ నక్షత్రాలు వెలుగొందుతాయి. దళిత స్త్రీల గుండె చప్పుళ్లు వినిపించగల కలం ఆయనది. ఆయన పాటలో లయాత్మక విన్యాసం ఉంటుంది. శ్రమ జీవులకు చెమట చుక్కలకు నక్షత్రాలుగా చూపించగల కలం ఆయనది. ఆయన గొప్ప శిల్పి, చిత్రకారుడు. ఆయన కవిత్వంలో తెలుగు నుడికారాల సవ్వడి వినిపిస్తుంది. ఆయనది మృదు మధురగానం 'ఆడదనీ' అనే కవితలో ఆయన స్త్రీ జగతికి మూలం

అని ఎలా డప్పు కొట్టి మరి చెప్తున్నారో చూడండి.

> 'సృష్టికి సృష్టి ఆడదని, ఆమెయే జగతికి మూలమని,
> తెలిసినవాళ్లే మనుషులని, తెలియనివారే పశువులని,
> జగతిన ఉన్న జనులకు తెలపాలియ్యాలో.. లియ్యాలో,
> ఉయ్యాలో ఉయ్యాలా ॥సృష్టికి॥
> డప్పులందుకొని దండోర ఈనాడెయ్యాలో
> ఎయ్యాలా ఎయ్యాలా ॥సృష్టికి॥
> పుట్టిన బిడ్డకు పురుడోసి బొడ్డును శ్రద్ధగా తెగకోసి
> మాయి మకిలి కడిగేసి మనిషికి ప్రాణం తాపోసి
> వైద్యం కోసం శస్త్ర చికిత్సను కనుగొన్నది
> ఓ ఆడదిగా
> ఆడదిగా మా ఆడదిగా, ఆడదిగా మా ఆడదిగా
> డప్పులందుకొని ఈ సంగతి దరువెయ్యాలో వెయ్యాలా ॥సృష్టికి॥

> మాష్టార్జీ అంబేద్కర్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తాత్వికుడు.
> 'త్యాగానికి నిలయం అమ్మరా!
> అనురాగానికి ఆలయం అమ్మరా!' అనగలిగిన అమృత హృదయుడు. గుండెల్లో ప్రేమ జల ఉన్నవాడు. సత్యాన్ని వధజేసి, ధర్మాన్ని చెరలేసి
> సత్యవంతులమంటూ దేశ పాలన కొచ్చి
> సత్యాన్ని జెప్పేటి దళితజనులను బట్టీ
> మూర్ఖ ఆచారాల ముండ్ల కంచెను వేసి
> నీతి బోధలంటూ ఈతిబాధల బెట్టి
> హేతువాదం జెప్పినా దళితులను
> ఊచకోతలు కోసిరి దళితులను
> సెమట సుక్కలతోని సేను పంటలు జేసి
> ఎముక గూళ్లను బేల్చి ఇంటి ఇటుకలు జేసి
> మాంస ముద్దలతోటి మేలి మేడలు గట్టి
> రక్తాన్ని గోడలకు రంగులుగ అద్దించి
> చివరికి శవములనే తివాచీలుగ బర్చి
> కంటలతో జేసిన దిండు సోఫాల మీద
> నిండుగ కూసుండి శ్రమజీవుల సెమట
> బ్రాందీలు తాగుతూ భేషు భేషంటుంటే

మాష్టార్జీ గొప్ప సామాజిక సాంస్కృతిక రాజకీయవేత్త. రాజ్యాధికార భావజాలాన్ని బహుజనుల్లో రేపిన సాహితీ ధీరుడు. మాష్టార్జీ పాటల తోట, మాష్టార్జీ ఉద్యమాల స్వరం, మాష్టార్జీ ఆత్మీయ సముద్రం. మాష్టార్జీ కవిత్వం ఒక సందేశం, ఒక మానవతా దర్శనం.

మాష్టార్జీ పాటలో కవిత్వ పరిమళాలు ప్రసరిస్తాయి. ఆయన పాటల్లో కన్నీటి సంద్రాలున్నాయి. మాష్టార్జీ తెలుగు నేలను తన పాటల ద్వారా చైతన్యపరిచిన వైతాళికుడు. గూడ అంజయ్య, గద్దర్, వంగపండు ప్రసాదరావు పాటల్లో ఉన్న తాత్విక, సామాజిక, జీవన పోరాటానికి అంబేద్కర్ తత్వశాస్త్రాన్ని అన్వయించిన గొప్ప అంబేద్కర్‌వాదులు. అంబేద్కర్ కుల నిర్మూలనకు కట్టుబడి కులాంతర వివాహం చేసుకొని కులాంతర సంస్కృతి వికాస ప్రబోధకుడిగా ఆంధ్ర రాష్ట్రమంతా తన డప్పు పాటతో నిద్ర లేపినవాడు మాష్టార్జీ. ఆయన స్వరంలో వెన్నెల ఉంది. వేడి ఉంది. కరుణ ఉంది. ప్రేమ ఉంది. ఆయనది తల్లితనం. చెల్లితనం. ఆయన మా కుటుంబమిత్రుడు. ఆత్మీయ సోదరుడు. ఎన్నో పోరాటాల్లో కలిసి పనిచేశాం. కారంచేడు పోరాటంలో గాంధీ మున్సిపల్ హైస్కూల్లో నా ఉపన్యాసానికి ముందుపాట పాడిన సామాజిక విప్లవ వీరుడు. ఆయన జీవితంలో ఘర్షణ ఉన్నది. ఆయన నాటకకర్త. బుర్రకథ గాయకుడు. సినిమా పాటల్లో కొత్తదనం తీసుకువచ్చిన వాగ్గేయకారుడు. ఆయన కొన్నిసార్లు రణభేరి మోగిస్తారు. యుద్ధానికి పిలుపునిస్తారు. పాటల్లో ఊయలలూపుతారు. కవిత్వంలో వ్యంగ్యం, ధ్వని ఆశ్చర్యం, అపూర్వం. ఆయన స్టేజీ మీద గజ్జె కట్టి డప్పు కొడితే గోదావరి నది ప్రవహించినట్టు ఉంటుంది. ఆయన కొన్నిసార్లు స్టేజి మీద నిప్పులు కురిపిస్తారు.

నిద్రాణమైన సమాజానికి చైతన్యాన్ని కలిగించే సాంస్కృతిక విప్లవ యోధుడు మాష్టార్జీ. అదొక కేక. అదొక హృదయ వేదనల నుంచి వచ్చిన దుఃఖాగ్రహం. రాజకీయ బానిసత్వానికి లొంగిపోయిన జాతులను నిద్ర లేపే బహుజన గాన ధ్వని. ఆయనే ఒక ఉద్యమం. ఆయన ఒక ప్రవాహం. ఆంధ్ర రాష్ట్రంలో అనేకమంది శిష్యులను, అనుచరులను సృష్టించిన దళిత కళామండలి సృష్టికర్త. మూలవాసి చరిత్రకు ఊపిరులూదిన గాన చరిత్రకారుడు. మాష్టార్జీ అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే ఆయన అనేక పోరాటాల్లో స్వయంగా పాల్గొన్న ఉద్యమ మిత్రుడు. పాటగాడు, కథకుడు, నృత్యకారుడు, దర్శకుడే కాదు... అతనొక సామూహిక, సాంస్కృతిక, సమన్వయ, సముజ్వల భానుడు. ఆయన మార్గంలో నడుద్దాం.

మహాకవి డాక్టర్ కత్తి పద్మారావు
98497 41695

ఎవరు కాదన్నా, ఔనన్నా మాష్టార్జీ ఒక యుగ గీతం. ఆయనొక చారిత్రక సత్యం. ఈనాడు దళిత, స్త్రీ వాద ఉద్యమాలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. ఈ 'స్త్రీ తత్వగీతాలు' ఆ ఉద్యమాలకు స్ఫూర్తినిస్తాయి. ముందుకు నడిపిస్తాయి. ఆత్మగౌరవాన్ని వెలిగిస్తాయి. ప్రతి దళిత స్త్రీ చేతిలో ఈ ఉద్యమ ఆయుధం ఉండవలసిందే! ఈ చైతన్యంతో ముందుకు నడుద్దాం.

ఇది ట్వంటీ ట్వంటీ ఫోర్

ఉత్కంఠమైన కాలం
కరిగిపోతున్నది
కాలగర్భంలో కలిసిపోతున్నది
కుంచించుకు పోతున్న
మెదళ్ల మొదళ్ల మధ్య
అగ్గి రాజేస్తూ..
సమయం సచ్చీలంగానే
బాధల బంతిని
వేగంగా బౌండరీకి గిరాటు కొట్టింది
ఇది ట్వంటీ ట్వంటీ ఫోర్

కురస ఆట మోజులా
ఒలికి పోతున్న క్షణాలను
ఉబుకుతున్న ఉద్వేగంతో
ఎంతో తీక్షణంగానే తిలకించాం
మనం హీరోలమో జీరోలమో
తేల్చేసే కాలం
కొత్త క్యాలెండర్ మీద కొలువైంది
ఇది ట్వంటీ ట్వంటీ ఫోర్

ఎన్ని పథకాలను డైరీలో లిఖించుకోలే
ఎన్ని ప్రారబ్ధాలను పేజీల్లో తిప్పేసుకోలే
మళ్లీ మళ్లీ తిరోగమనంలోకి వద్దు
అన్నింటా వేగం దౌడు తీస్తోంది
కాలం వెంట పరుగిడక తప్పదు

బాధలోనూ బతుకులోనూ..
కాలమెప్పుడూ కొత్తగా
ఓ బూచోడిని సృష్టిస్తుంది
భయంలో బతకటానికో
బతుకే భయం కావటానికో
ఇది ట్వంటీ ట్వంటీ ఫోర్

చీకటి వాకిట్లోని భేతాళ ప్రశ్నలు
కాపు గాసుకొని కాలాన్ని గీస్తుంటే!
విధ్వంసమవుతున్న
మానవీయ విలువలకు సమాధానంగా
మరో విక్రమార్కుడివై పోవాలి
ఉదయార్కుడివై పొడుసుకు రావాలి
గతమంతా మూఢంగా మూడ్‌గా
కృంగిపోయాం.. కూలిపోయాం
ఇప్పుడిది ట్వంటీ ట్వంటీ ఫోర్
వన్.. టూ.. త్రీ.. స్టార్ట్
ఉయ్ షెల్ ఓవర్ కమ్..

అలా నిస్తేజంగా నిశ్శబ్దంగా
నిట్టూర్పు విడుస్తూ కూర్చోకు
కాలం నీ ముందు మోకరిల్లదులే.. నడువ్.. పరుగులుతియ్
యూ విల్ విన్.. యూ విల్ విన్
ఇది ట్వంటీ ట్వంటీ ఫోర్!

డా.కటుకోర్యుల రమేష్
99490 83327

మారేది కాలమే!

కాలాలు మారుతూ ఉంటాయి
మనుషులు మారుతుంటారు
పయనం మాత్రం ఆగదు!

> పరిమళం వికసించిన చోట
> వాడిపోయే వికారమూ ఉంటుంది,
> గెలుపు ఉన్నచోట
> ఓటమి కూడా సిద్ధంగా ఉంటుంది!

అన్నింటినీ ఎదుర్కొనేవాడే
ముందుకు సాగిపోతాడు,
కాదని అక్కడే ఆగిపోతే
మిగిలేది చివరికి శూన్యమే!

> కొత్త అడుగు వేసే ప్రతిసారి
> కొండంత అడ్డంకులు ఎదురౌతాయి,
> అన్నింటినీ జీర్ణించుకుంటేనే
> జీవించగలుగుతాం!

కొత్తదనం ఎప్పుడూ
పాతదనాన్ని తిరస్కరించదు,
అన్నింటినీ కలుపుకొని
నూతన ఉత్సాహంతో సాగమంటుంది!

> ఏడాది గడిచేకొద్దీ
> ఏం సాధించామని ప్రశ్న ఉదయిస్తుంది,
> సమాధానం వెలుగొందినప్పుడే
> కక్ష గట్టిన కాలం మౌనంగా ఉంటుంది!

ఎదురీదితే
ఏదైనా తల వంచాల్సిందే,
వెంటపడితే
ఏదైనా గుప్పిట్లో చేరిపోవాల్సిందే!

పుట్టి గిరిధర్
94949 62080

ఆర్ద్ర కవితాఝరి- సిరిప్రెగడ

'తెలంగాణం తెలుగు తల్లి అందాల కొప్పు, ఆ తల్లి తన కొప్పులో ముద్దుగా ముడుచుకున్న ఒక మల్లె మన భార్గవుడ'ని ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మచే ప్రశంసలందుకున్న సిరిప్రెగడ భార్గవరావు నల్గొండ జిల్లా చండూరు మండలంలోని గుండ్రెపల్లెలో 1923లో జన్మించారు. లక్ష్మణ రావు, రుక్మమ్మ దంపతులకు జన్మించారు. సిరిప్రెగడ రచించిన భార్గవానంద లహరి ఖండకావ్యం ప్రముఖ కవుల ప్రశంసలనందుకున్నది. ఇది పన్నీరు, కన్నీరు, మున్నీరు అనే మూడు పాయలుగా ప్రవహిస్తుంది. ఈ కావ్యంలోని కన్నీరును చదివిన పాఠకులెవరూ కన్నీళ్లు కార్చకుండా ఉండలేరు. అందుకు కారణం తాను ఎంతగానో ప్రేమించిన తన భార్య అకాలమృతితో భార్గవుడు పొందిన హృదయవేదన పద్యరూపాన్ని సంతరించుకోవడమే.

ఈ రచనను చదివిన కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి 'భార్గవానంద లహరి సహృదయ హృద్యంగమైన ఖండ కావ్య సముచ్చయం' అని పేర్కొన్నారు. ఇక ఈ కావ్యాన్ని పరిశీలించిన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 'పాపమాయిన గతాయువట! పరమేశ్వరుడే పువ్వునెప్పుడెందుకు త్రుంచుకొని పోతాడో యెవరికి తెలియును' అంటూ సంతాపం వెలిబుచ్చాడు. జలసూత్రం రుక్మిణి నాథ శాస్త్రి భార్గవానంద లహరిని చూసి, చదివి నా మనసు నీరయినది' అని పేర్కొన్నారు. ఈ కావ్యంలోని కొన్ని పద్యాలు 1970 డిగ్రీ పాఠ్య పుస్తకంలో చోటుచేసుకున్నాయి. తర్వాతి కాలంలో ఓయూ పీజీ సిలబస్‌లో కూడా చేరాయి.

తన కవితా వ్యాసంగంతో పలువురు సాహిత్యాభిమానుల గుండెల్లో ఆయన స్థానం సంపాదించుకోగలిగినా, తెలంగాణ జన బాహుళ్యానికి ఆయన ఒక అజ్ఞాత కవిగానే మిగిలిపోయాడు. అందుకు కారణం ఆయన ఎన్నడూ పేరు కోసం పాకులాడకపోవడమే.

ప్రకృతి జీవించడంతోనే పరవశించే వాడాయన. పల్లెలు ఆయనకు ప్రాణపదం. ఆయన ప్రతిభా పాటవాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి పట్నవాసం దోహదపడుతుందని అందువల్ల పల్లె విడిచి పట్నం రమ్మని ఆయన స్నేహితులు, పలుమార్లు కోరినప్పటికీ, ఆయన పల్లె విడిచి పట్నం పోలేదు అంతేకాదు..

> 'పల్లెలు మా నివాసములు పచ్చని పంట
> పొలాలు మా మనః
> పుల్లత గూర్చు చైత్రములు బోదెలపైని
> రసాలశాఖికా
> పల్లవుముల్ గ్రసించు చిరుపాటల బీయని
> తేనె తేటలన్
>
> జల్లు పికంబు మా యనుగు చెల్లెలు గానమె మాదు ప్రాణమౌ' అని చెప్తూ చివరి శ్వాస వరకు ప్రకృతారాధకుడిగా జీవించాడు. తెనుగు భాష తీయందనాలతో పరవశించిన ఆయన హృదయం తెనుగు సాహిత్య నందనవనంలో ఎన్నో పరిమళ పుష్పాలని వికసింపజేసింది. వాటిలో ఒకటి...

'కనిపించు నొకసారి కవి సార్వభౌమ రత్న స్వర్ణ మకుట శృంగార కాంతి
చెవిసోకు నొకసారి కవితాపితామహు గండపెండేరంబు కలరుతంబు
పులకింతు నొకసారి తులకించు భావాలు సలిపెడి మువ్వంపు చక్కిళులకు
గమకింతు నొకసారి కలితరసోపేత పద్యంపు టనవద్య హృద్యధార
అమ్మా అమ్మా యటంచు నోరార నిన్ను బిలువజేసిన నా పుణ్య ఫలమునెంచి
సంతసింతును విరిదండ సంతరింతు
లలితగుణ కల్పవల్లి మా తెలుగు తల్లి' అంటూ తెలుగు తల్లి వైభవాన్ని కీర్తించాడు.

దాశరథికి సిరిప్రెగడ సన్నిహితుడు. దాశరథితో కలిసి ఎన్నో పద్యాలను రచించాడు. అంతే కాదు, ప్రధానసభ్యుడిగా చండూరు 'సాహితిమేఖల' సంస్థ స్థాపనలో ఎంతో కృషిచేశారు. అంబటిపూడి వెంకటరత్న మహాకవికి ప్రియమైన శిష్యుడు. వెంకటరత్నం వద్ద సంస్కృతాంధ్ర కావ్యాలను అభ్యసించిన సిరిప్రెగడ పద్య రచనలో ప్రావీణ్యం సాధించి పండిత జనరంజకాలైన పద్యాలనెన్నింటినో రచించాడు. అయితే భార్గవరావు సాహిత్యానికి మాత్రమే పరిమితం కాలేదు. దాశరథి ప్రభావంతో స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో ఒక దేశ భక్తుడిగా తన పాత్ర నిర్వహిస్తూ, సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు నిజాం పాలనలో ఏడాది పాటు కఠిన కారాగార శిక్షను అనుభవించారాయన. జైలు జీవితం ఆయన ఆరోగ్యాన్ని క్షీణింపజేసింది. అయినా ఆయన రచనా వ్యాసంగం ఆగలేదు.

బసవరాజు నరేందర్‌రావు
99085 16549

సిరిప్రెగడ భార్గవుడి సాహిత్య గొప్పదనాన్ని గుర్తించిన ఆయన గురువు అంబటిపూడి వెంకటరత్నం భార్గవుణ్ణి ఎంతగానో ప్రోత్సహించారు. తన రచనలన్నీ ఒక నోట్‌బుక్‌లో భద్రపరచమని భార్గవుడికి చెప్పేవాడు. అయినా కేవలం చిత్తు కాగితాల మీదనే పద్యాలని రాసేవాడు సిరిప్రెగడ. కాకపోతే వాటన్నింటినీ ఒక ట్రంకు పెట్టెలో పడేశాడు.

1963లో సిరిప్రెగడ మరణించిన తర్వాత, కుటుంబసభ్యుల సహకారంతో భార్గవుడి ట్రంకు పెట్టెను వెంకటరత్నం తెరిపించి చూడగా అద్భుతమైన సాహిత్యం వెలుగులోకి వచ్చింది. అంబటిపూడి కృషితో 'సాహితీమేఖల' సంస్థ సిరిప్రెగడ రచనలను 1967లో భార్గవానంద లహరి పేరుతో ముద్రించింది. ఇందులో మొత్తం 277 పద్యాలున్నాయి. ఇవి 30 ఖండికలుగా విభజించబడ్డాయి. శిష్యుడు సిరిప్రెగడ ప్రతిభను గుర్తించి, ఆయన కావ్యాన్ని తెలుగు సాహిత్య లోకానికి గురువు అంబటిపూడి అందించకపోయి ఉంటే ఒక మహాకావ్యం చిత్తుకాగితాలతో కలిసి మరుగునపడిపోయేదే. అంబటిపూడి కృషికి తెనుగు సాహిత్య సాహితీలోకం ఎంతో రుణపడి ఉన్నది.

సమాంతరంగా

ఆకాశానికి పిడకలు కొట్టి
భూమికేసి చూస్తున్నాడు మనిషి
పచ్చగా పరిచిన ప్రకృతిని
ఎవరైనా తొక్కేస్తారని

జడ చిక్కు
విడిపించుకోడానికి నేలమ్మ
బీడు సెలకపై కురుల్ని ఆరబోసి
మొక్కల్ని విదిలించుకుంటోంది

రసాయనాల సమ్మేళనంలో
మనిషి మిళితమైపోతున్నాడు
దేహాన్ని మందు బిల్లతో బ్రతికిస్తూ
కాలం వెళ్ళబుచ్చుతూ

చూపు కంటే
ముందు నడుస్తున్నాడు మనిషి
ఆరడుగుల నేలను
ఒక్క అడుగులో కలిపేస్తూ
కొలతకు సమానంగా విధి
ఒప్పందానికి సమాంతరంగా
అడుగులు వడివడిగా వేస్తున్నాడు

నరెడ్డుల రాజారెడ్డి
96660 16636

కలం పిలుపు

'బాల సారస్వతం' కథల పోటీ

తెలంగాణ సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న 'బాల సారస్వతం' బాల సాహిత్య గ్రంథాల పరంపరలో త్వరలో ప్రచురించే బాల కథా సంకలనాల కోసం కథలు పంపించాలని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య తెలిపారు. బాలల మూర్తిమత్వ వికాసం, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ బాంధవ్యాలు, మానవతా, నైతిక విలువలు, శాస్త్రీయ దృక్పథం, మాతృభాషా సంస్కృతులపై అభిమానం తదితర అంశాలను ఎంచుకొని 2024 జనవరి 20వ తేదీలోపు telanganasaraswathaparishath@gmail.com ఈ-మెయిల్‌కు కథలు పంపించాలి. ఉత్తమ కథలకు బహుమతులు కూడా ఉంటాయి. ఇతర వివరాలకు 8885245234 నంబర్‌కు సంప్రదించాలి.

ప్రకటనలు

పుస్తకావిష్కరణ సభ

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మినీ హాల్ వేదికగా.. సాహితీ సోపతి కరీంనగర్ ఆధ్వర్యంలో 2024 జనవరి 6 శనివారం రోజున సాయంత్రం ఆరు గంటలకు సీనియర్ జర్నలిస్ట్ మంగళారపు లక్ష్మణ్ రచించిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' పుస్తకావిష్కరణ సభ జరగనున్నది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం సంచాలకులు ఆచార్య ఘంటా చక్రపాణి చేతులమీదుగా పుస్తకావిష్కరణ జరగనున్నది. ప్రముఖ కవి, రచయిత అన్నవరం దేవేందర్ సభాధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. తెలంగాణ ఉద్యమకారులు, రచయిత వి.ప్రకాశ్ ముఖ్యఅతిథిగా, శాసన మండలి సభ్యులు నారదాసు లక్ష్మణ్ రావు గౌరవ అతిథిగా, జర్నలిస్ట్ ఎస్‌కే జకీర్ ఆత్మీయ అతిథిగా హాజరుకానున్నారు. ప్రముఖ రచయిత డా. వెల్దండి శ్రీధర్ పుస్తక పరిచయం చేయనున్నారు.